కాంగ్రెస్ ఎమ్మెల్యే నివాసం, కార్యాలయంపై ఈడీ దాడులు

బెంగళూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కోలారు జిల్లా మాలూరు కాంగ్రెస్ ఎమ్మెల్యే కేవై నంజేగౌడ నివాసం, కార్యాలయంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు సోమవారం దాడులు చేశారు. కోలారు, చిక్కబళ్లాపుర జిల్లా పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం (కోచిముల్) అధ్యక్షుడిగాను నంజేగౌడ వ్యవహరిస్తున్నారు. ఇటీవల కోచిముల్‌లో నియామకాల్లో భారీగా అవినీతి జరిగిందనే ఆరోపణలు ఉన్నాయి. ఒక్కో పోస్టుకు రూ.40-50 లక్షల దాకా వసూలు చేసినట్టు ఆరోపణల మేరకు 25 మంది దాడి చేశారు. డెయిరీలోనూ రికార్డులను పరిశీలించారు. ఆయన స్వగ్రామం కొమ్మనహళ్లిలోని ఎమ్మెల్యే నివాసంపైనా దాడులు చేశారు.

మార్పు తప్పదా..?

- యువత వైపు కమలదళం చూపు
- లోక్‌సభ ఎన్నికల్లో సీనియర్లకు గేట్‌పాస్
- వారసుల కోసం మరికొందరి ప్రయత్నాలు



బెంగళూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గడిచిన మూడు లోక్‌సభ ఎన్నికల నుంచి బీజేపీకి తిరుగులేని స్థానాలు దక్కుతున్నాయి. వరుసగా బీజేపీ అభ్యర్థులు గెలుపొందుతున్న నియోజకవర్గాలే అధికంగా ఉన్నాయి. ఐదారుసార్లకుపైగా గెలుపొందిన ఎంపీలు ఉత్తర కర్ణాటకలో ఎక్కువగా ఉన్నారు. రాష్ట్రం నుంచి ప్రాతినిత్యం వహిస్తున్న ఎంపీలలో చాలా మంది ఏడుపదులు దాటినవారు ఉన్నారు. బీజేపీ అధిష్టానం వివిధ రాష్ట్రాల్లో జరుగుతున్న శాసనసభ ఎన్నికలతోపాటు 2019 లోక్‌సభ ఎన్నికల్లోనూ ఎన్నో మార్పులు చేసింది. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ శాసనసభ ఎన్నికల్లో సిట్టింగులు, మంత్రులను సైతం పక్కనపెట్టి ఎన్నికల్లో తిరుగులేని విజయాలు నమోదు చేసింది. సరికొత్త ప్రయోగాలతోనే లోక్‌సభ ఎన్నికలకు వెళ్లాలని భావిస్తున్నట్టు తెలుస్తోంది. ఏడు పదులు దాటిన సీనియర్లను పక్కనపెట్టి యువతకు టికెట్లు ఇవ్వాలని పరిశీలిస్తున్నట్టు తెలుస్తోంది. ఐదేళ్లకాలంలో ఏమాత్రం నియోజకవర్గంపై పట్టు సాధించని ఎంపీలకు ఈసారి గేట్‌పాస్ తప్పదనే సంకేతాలు ఉన్నాయి. ఇప్పటికే పలువురు ఎంపీలు ఎన్నికల్లో పోటీ చేసేది లేదని ప్రకటించుకున్నారు. మరికొందరికి టికెట్లు ఉండవని అధిష్టానం సూచించింది. ఇంకా ఎటువంటి సమాచారం లేక మరోసారి ప్రయత్నిస్తున్న వారి పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. ముఖ్యమంత్రిగా, కేంద్రమంత్రిగా వ్యవహరించిన సదానందగౌడకు టికెట్ లేదని సూచించడంతో ఆయన ప్రత్యక్ష రాజకీయాలకు గుడ్‌బై చెప్పారు. వచ్చే ఎన్నికల్లో చిక్కబళ్లాపుర, బెంగళూరు ఉత్తర, బెంగళూరు సెంట్రల్, మైసూరు, చామరాజనగర, మంగళూరు, ఉత్తరకన్నడ, ఉడుపి, చిత్రదుర్గ, బిజాపూర్, బళ్లారి, బెళగావి, హావేరికి కొత్త అభ్యర్థులు, వారసులు తెరపైకి వస్తున్నారు. చిక్కబళ్లాపుర ఎంపీ బచ్చేగౌడ పార్టీకి వ్యతిరేకంగా మారిపోయారు. ఆయన కుమారుడు శరత్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అయ్యాక మరింత ముందుకెళ్లారు. ఇదే స్థానం నుంచి మంత్రిగా కొనసాగిన డాక్టర్ సుధాకర్‌తోపాటు యలహంక ఎమ్మెల్యే ఎస్‌ఆర్ విశ్వనాథ్ కుమారుడు అలోక్ ప్రయత్నిస్తున్నారు. అలోక్‌కు టికెట్ ఇస్తే గెలిపించుకొస్తానని విశ్వనాథ్ పార్టీ సీనియర్లను కోరారు. బెంగళూరు ఉత్తర ఎంపీ సదానందగౌడ పోటీ చేయడం లేదు. దీంతో ఈ నియోజకవర్గానికి కేంద్ర మాజీ మంత్రి శోభాకరంద్లాజె, సీటీ రవి పేర్లు ప్రస్తావనకు వస్తున్నాయి. సీటీ రవి ఉడుపి- చిక్కమగళూరు టికెట్ కోసం ప్రయత్నిస్తున్నారు. అక్కడ ఎంపీగా ఉండే శోభాకరంద్లాజె బెంగళూరు ఉత్తరవైపు వస్తే రవికి క్లియరెన్స్ ఇచ్చినట్టు అవుతుంది. ఇక మాజీ మంత్రి సీపీ యోగేశ్వర్ కూడా ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. మైసూరు సిట్టింగ్ ఎంపీ ప్రతాప్‌సింహాపై ఇటీవల తలెత్తిన వివాదాలతో మైసూరు యువరాజు యదువీర్ ఒడయార్ పేరు తెరపైకి వచ్చింది. చామరాజనగర్ నుంచి శ్రీనివాస్ ప్రసాద్ పోటీ చేసేది లేదని ప్రకటించడంతో ఆయన అల్లుడు, మాజీ ఎమ్మెల్యే హర్షవర్ధన్‌తోపాటు బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్ మహేశ్ పోటీ పడుతున్నారు. ఇక పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా కొనసాగిన నళిన్‌కుమార్ కటీల్‌కు అధిష్టానం టికెట్ నిరాకరించే అవకాశాలు ఉన్నాయని ప్రచారం సాగుతోంది. అయితే ఇటీవల మంగళూరు పర్యటనలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర మరోసారి ఇక్కడ కటీల్ అభ్యర్థి అంటూ ప్రకటించారు. ఈలోగా కెప్టెన్ బ్రిజేశ్ చౌట తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. బళ్లారి నుంచి మాజీ మంత్రి శ్రీరాములు, ఎంఎస్ సోమలింగప్ప ప్రయత్నాలు సాగిస్తున్నారు. సిట్టింగ్ ఎంపీ దేవేంద్రప్ప కూడా మరోసారి టికెట్ ఆశిస్తున్నారు. దావణగెరె ఎంపీ, కేంద్ర మాజీ మంత్రి జీఎం సిద్దేశ్వర్ కొన్ని నెలల క్రితం పోటీకి దూరమని ప్రకటించినా ఇటీవల తాను సైతం అంటూ ముందుకొచ్చారు. ఈ స్థానం నుంచి మాజీ ఎంపీ రేణుకాచార్య తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. బెళగావి ఉప ఎన్నికల్లో గెలుపొందిన కేంద్ర మాజీ మంత్రి సురేశ్ అంగడి భార్య మంగళ అంగడి మరోసారి టికెట్‌కోసం ప్రయత్నిస్తున్నారు. మాజీ ఎమ్మెల్సీ మహంతేశ్ కవటిగ మఠ, మాజీ ఎమ్మెల్యే అనిల్‌బెనక, మహంతేశ్ ఒక్కుంద, సంజయ్‌పాటిల్ ప్రయత్నిస్తున్నారు. చిక్కోడి నుంచి మరోసారి అన్నాసాహెబ్ జొల్లెతోపాటు రమేశ్‌కత్తి ప్రయత్నిస్తున్నారు. ఉత్తర కన్నడ సిట్టింగ్ ఎంపీ అనంతకుమార్ హెగ్డే మరోసారి పోటీ చేయనున్నారు. ఇదే స్థానంపై కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాలశాఖ మంత్రి ప్రహ్లాద్‌జోషి దృష్టి సారించారు. మాజీ స్పీకర్ విశ్వేశ్వరహెగ్డే కాగేరి, సునిల్‌హెగ్డే, యువబ్రిగేడ్ ముఖ్యులు చక్రవర్తి సూలిబెలె పేర్లు కూడా ప్రచారంలో ఉన్నాయి. హావేరి, గదగ్ ఎంపీ శివకుమార్ ఉదాసి పోటీ చేసేది లేదని ప్రకటించిన మేరకు ఈ స్థానం నుంచి మాజీ మంత్రి ఈశ్వరప్ప కుమారుడు కాంతేశ్, మాజీ మంత్రి బీసీ పాటిల్, శరణబసవ అంగడి పేర్లు హల్‌చల్ చేస్తున్నాయి. బాగల్కోటె నుంచి సిట్టింగ్ ఎంపీ పీసీ గద్దిగౌడర్‌తోపాటు మాజీ మంత్రి మురుగేశ్ నిరాణి, ప్రకాశ్ జె. పరప్ప పోటీలో ఉన్నారు. విజయపుర రిజర్వు నియోజకవర్గం నుంచి కేంద్ర మాజీ మంత్రి రమేశ్ జిగజిణగి టికెట్ రాదనే సంకేతాలతో డాక్టర్ బాబు రాజేంద్రనాయక్, మహేంద్రనాయక్ ప్రయత్నిస్తున్నారు. ప్రస్తుత ఎంపీలలో రమేశ్ జిగజిణగి, జీఎస్ బసవరాజు, డీవీ సదానందగౌడ, జీఎం సిద్దేశ్వర్, గద్దిగౌడర్, శ్రీనివాస్ ప్రసాద్ 70ఏళ్లు దాటినవారు. ఇటీవలే కేంద్రమంత్రి నారాయణస్వామి రాజకీయాలకు గుడ్‌బై చెప్పాలని ప్రకటించిన మేరకు చిత్రదుర్గ నుంచి బరిలోకి దిగేందుకు పలువురు ప్రయత్నిస్తున్నారు. శివమొగ్గ నుంచి బీవై రాఘవేంద్రకు, బెంగళూరు దక్షిణ నుంచి తేజస్విసూర్య టికెట్ల విషయంలో మార్పు ఉండదని సమాచారం. బెంగళూరు సెంట్రల్ పీసీ మోహన్ మార్పుపైనా ప్రచారం జరుగుతోంది. ఎన్డీయే కూటమిలో జేడీఎస్ చేరడంతో హాసన్ స్థానం మరోసారి ప్రజ్వల్ రేవణ్ణకు దక్కనుందనే సంకేతాలు ఉన్నాయి. జేడీఎస్‌కు ఖరారయ్యే సీట్లను బట్టి బీజేపీ అభ్యర్థుల్లో స్పష్టత రానుంది. సంక్రాంతిలోగానే కుమారస్వామి ఢిల్లీ వెళ్లి అమిత్‌షాతో చర్చలు జరిపే అవకాశాలు ఉన్నాయి.



బీజేపీ కార్యాలయం

లోక్‌సభ ఎన్నికల బాధ్యత
మంత్రులదే

- అభ్యర్థి ఓడిపోతే వేటు
- కాంగ్రెస్ అధిష్టానం హెచ్చరిక
- లోక్‌సభ నియోజక వర్గాలకు ఇన్‌చార్జిలుగా నియామకం



బెంగళూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): శాసనసభ ఎన్నికల్లో విజయోత్సాహాన్ని లోక్‌సభ సమరంలోనూ కొనసాగించేందుకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కమిటీ వ్యూహాలు సిద్ధం చేసింది. అందుకు అనుగుణంగానే పార్టీ అధిష్టానం కూడా ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ ప్రతిపాదనలకు సుముఖత వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. లోక్‌సభ ఎన్నికలకు మంత్రులను ఇన్‌చార్జిలుగా సోమవారం నియమించారు. వారి ద్వారానే ఎన్నికల్లో అన్ని ప్రక్రియలు కొనసాగించాలని తీర్మానించారు. అభ్యర్థులు ఓడిపోతే మంత్రులపై వేటు తప్పదని అధిష్టానం హెచ్చరించిందని తెలిపారు. ఈ మేరకు లోక్‌సభ నియోజకవర్గాల వారిగా ఇన్‌చార్జ్‌లను ప్రకటించారు. బాగల్కోటెకు మంత్రి ఆర్‌బీ తిమ్మాపుర, బళ్లారి- బి. నాగేంద్ర, బీదర్-ఈశ్వర్‌ఖండ్రె, చిక్కమగళూరు - ఉడుపికి కేజే జార్జ్, చిత్రదుర్గ-డాక్టర్ సుధాకర్, దక్షిణకన్నడ-దినేశ్ గుండూరావు, దావణగెరె-ఎస్‌ఎస్ మల్లికార్జున్, ధారవాడ-సంతోష్‌లాడ్, కలబురగి-ప్రియాంక ఖర్గే, హాసన్-రాజణ్ణ, హావేరి-శివానంద పాటిల్, కొప్పళ- శివరాజ్ తంగడగి, మండ్య- చెలువరాయస్వామి, శివమొగ్గ- మధుబంగారప్ప, తుమకూరు- పరమేశ్వర్, ఉత్తరకన్నడ- మంకాళ్‌వైద్యలను ఖరారు చేశారు. బెంగళూరు గ్రామీణకు మంత్రి కేహెచ్ మునియప్పకు బదులుగా భైరతి సురేశ్‌ను, బెంగళూరు నగరానికి డీసీఎం డీకే శివకుమార్, బెంగళూరు ఉత్తరకు కృష్ణబైరేగౌడ, బెంగళూరు సెంట్రల్‌కు జమీర్ అహ్మద్ ఖాన్, బెంగళూరు దక్షిణకు రామలింగారెడ్డిని నియమించారు. చామరాజనగర రిజర్వు నియోజకవర్గానికి మంత్రి వెంకటేశ్‌కు బదులుగా హెచ్‌సీ మహదేవప్పను నియమించారు. ఇదే స్థానం నుంచి మంత్రి మహదేవప్ప కుమారుడు సునిల్‌బోస్ టికెట్‌ను ఆశిస్తున్నారు. మైసూరు - కొడగు లోక్‌సభ స్థానానికి సీఎం సిద్దరామయ్య కుమారుడు డాక్టర్ యతీంద్ర టికెట్‌ను ఆశిస్తుండడంతో సీఎంకు ఆప్తుడైన మంత్రి వెంకటేశ్‌కు బాధ్యతలు అప్పగించారు. కొడగు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ఎన్‌ఎస్ బోసరాజుకు సొంత ప్రాంతం రాయచూరు బాధ్యతలు అప్పగించారు. చిక్కబళ్లాపురకు డాక్టర్ ఎంసీ సుధాకర్ ఇన్‌చార్జ్ మంత్రి అయినా కోలారుకు చెందిన కేహెచ్ మునియప్పకు అవకాశం ఇచ్చారు. బెళగావికి మంత్రి సతీశ్‌జార్కిహోళి, చిక్కోడికి హెచ్‌కే పాటిల్‌ను నియమించారు. మంత్రులు శరణప్రకాశ్ పాటిల్, లక్ష్మీ హెబ్బాళ్కర్, శరణబసప్ప దర్శనాపురకు ఏ నియోజకవర్గాల బాధ్యతలు అప్పగించలేదు. కనీసం 20 స్థానాలు గెలుపొందాలని పార్టీ భావిస్తోంది. ఆ దిశగానే పనిచేయాలని బాధ్యతలు అప్పగించిన మంత్రులకు అల్టిమేటం జారీ చేసినట్టు తెలుస్తోంది. ఈలోగానే జూలైలో మంత్రివర్గ విస్తరణ ఉంటుందనే హెచ్చరికలను జారీ చేశారు. దీన్నిబట్టి అభ్యర్థులను గెలిపించకపోతే మంత్రి పదవి గల్లంతు అవుతుందనే సందేశమిచ్చారు. ప్రారంభంలో ఆరేడుగురు మంత్రులను లోక్‌సభ ఎన్నికల బరిలోకి నిలపాలని కేపీసీసీ అధ్యక్షుడి హోదాలో డీకే శివకుమార్ భావించారు. అయితే ఎమ్మెల్యేలుగా గెలిచిన ఏడాదిలోగానే లోక్‌సభ ఎన్నికలకు పంపడం సరికాదని సీఎం సున్నితంగా తిరస్కరించి అధిష్టానానికి వివరించిన మేరకు వారు అంగీకరించారు. దీన్నిబట్టి మంత్రులు పోటీ చేసే అవకాశం నుంచి తప్పుకున్నట్టయింది. అయితే ఇన్‌చార్జ్ బాధ్యతల ద్వారా మెలికపెట్టారు.

మృతుల కుటుంబాలను ఓదార్చిన నటుడు యశ్

బెంగళూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): గదగ్ జిల్లా లక్ష్మేశ్వర తాలూకా సూరణగి గ్రామంలో ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తూ విద్యుత్ షాక్‌తో మృతి చెందిన అభిమానుల కుటుంబీకులను నటుడు యశ్ ఓదార్చారు. సినిమా షూటింగ్‌ను రద్దు చేసుకుని సోమవారం సాయంత్రం గదగ్ జిల్లాకు వచ్చారు. బెంగళూరు నుంచి ప్రత్యేక విమానంలో హుబ్బళ్లికి చేరుకుని అక్కడి నుంచి సూరణగి గ్రామానికి వెళ్లారు. మృతి చెందిన హనుమంత హరిజన, మురళి నడవిన మనె, నవీన్ గాజి ఇళ్ల వద్దకు వెళ్లారు. ప్రతి కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబ సభ్యుల రోదనలతో యశ్ భావోద్వేగానికి లోనయ్యారు. మీ కుటుంబాలకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ప్రమాదంతో మీ కుటుంబ సభ్యులే కాదు... నా అభిమానులు మృతి చెందడం జీర్ణించుకోలేకపోతున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి కుటుంబం వద్ద కొద్దిసేపు గడిపి వారిని ఓదార్చి ధైర్యం చెప్పారు.



రాత్రి ఒంటిగంట దాకా పబ్‌లో పార్టీ

- సినీ ప్రముఖులకు పోలీసుల నోటీసు

బెంగళూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): సమయానికి మించి పబ్‌లో పార్టీ చేసుకున్న మేరకు కన్నడ సినిమా రంగానికి చెందిన ప్రముఖులకు పోలీసులు నోటీసులు జారీ చేశారు. నటుడు దర్శన్, డాలీ ధనంజయ్, చిక్కణ్ణ, నిర్మాత రాక్‌లైన్ వెంకటేశ్, అభిషేక్ అంబరీశ్, నినాసం సతీశ్, సంగీత దర్శకుడు హరికృష్ణ, దర్శకుడు తరుణ్ సుధీర్‌కు సోమవారం నోటీసులు జారీ చేశారు. దర్శన్ హీరోగా నటించిన 'కాటేరా' సినిమా విజయవంతం కావడంతో ఈనెల 3న నగరంలోని జెట్‌ల్యాగ్ రెస్టారెంట్ బార్‌లో పార్టీ చేసుకున్నారు. రాత్రి 12.30 గంటలకు బీట్ పోలీసులు పబ్‌ను మూసివేయాలని సూచించారు. అయితే రాత్రి ఒంటి గంట తర్వాత కూడా మద్యం సరఫరా చేసినట్టు గుర్తించారు. పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ సూచన మేరకు కర్ణాటక పోలీసు చట్టం, అబ్కారి నిబంధనలకు అనుగుణంగా సుబ్రహ్మణ్యనగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్టు ఉత్తర విభాగం డీసీపీ సైదులు అడావత్ తెలిపారు. జెట్‌ల్యాగ్ రెస్టారెంట్ మేనేజర్‌కు నోటీసులు ఇచ్చామన్నారు. రెస్టారెంట్‌కు సంబంధించి సీసీటీవీ ఫుటేజీలను స్వాధీనం చేసుకున్నారు. నోటీసులు అందిన వెంటనే స్టేషన్‌కు హాజరు కావాలని స్పష్టం చేసినట్టు తెలిపారు.

బడ్జెట్‌పై సీఎం కసరత్తు


- అన్ని వర్గాలను ఆకట్టుకునేలా రూపకల్పన
- గ్యారెంటీ పథకాలకు భారీగా నిధులు
- రూ.3.5 లక్షల కోట్లు దాటనున్న బడ్జెట్



బెంగళూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సిద్దరామయ్య వార్షిక బడ్జెట్‌కు కసరత్తు ప్రారంభించారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ గాత్రం ఈసారి రూ.3.5లక్షల కోట్ల కు పైగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. 2023-24 వార్షిక బడ్జెట్ గాత్రం రూ.3.27 లక్షల కోట్లుగా ఉన్న సంగతి తెలిసిందే. లోక్‌సభ ఎన్నికల ముందు అన్ని వర్గాల ప్రజలను ఆకట్టుకునేలా, పేదలు, మధ్యతరగతి వర్గాలపై పన్ను భారం లేకుండా బడ్జెట్ రూపకల్పన చేయనున్నట్టు సమాచారం. అబ్కారీశాఖ ద్వారా ఆదాయాన్ని మరింతగా పెంచుకోవాలని భావిస్తున్న సీఎం, మద్యం ప్రియులకు ఒకింత షాక్ ఇచ్చే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఐదు గ్యారెంటీ పథకాలకు గత బడ్జెట్‌లో రూ.52వేల కోట్లు కేటాయించగా ఈసారి ఈ మొత్తాన్ని మరింతగా పెంచే అవకాశం ఉన్నట్టు సీఎంఓ కార్యాలయ వర్గాలు వెల్లడించాయి. ప్రత్యేకించి గృహలక్ష్మి, గృహజ్యోతి పథకాలను మరింతగా విస్తరించాలని ప్రభుత్వం భావిస్తోంది. అలాగే యువనిధి పథకం కూడా ఈనెల 12న ప్రారంభం కానుండడంతో దీనికి కూడా బడ్జెట్‌లో పూర్తి స్థాయి కేటాయింపులు చేయనున్నారు. ఆర్థిక వనరులను పెంచుకునే అంశంపై కూడా ముఖ్యమంత్రి దృష్టి సారించారు. ఇందులో భాగంగా ఆయన ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేశారు. ఈ టీమ్‌లో ముఖ్యమంత్రి ఆర్థిక వ్యవహారాలు చూస్తున్న ఎల్‌కే అతీక్‌తోపాటు సహజ వనరుల ఆదాయాన్ని పర్యవేక్షిస్తున్న డాక్టర్ పీసీ జాఫర్, ఆర్థికశాఖ కార్యదర్శి విశాల్ తదితర ఉన్నతాధికారులు ఉన్నారు.

సిద్దూకు ఇది 15వ బడ్జెట్

ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు 2024-25 ఆర్థిక సంవత్సరపు బడ్జెట్ ఏకంగా 15వది కానుంది. ఇంతవరకు ఆయన 14సార్లు బడ్జెట్‌ను సమర్పించారు. గతంలో రామకృష్ణహెగ్డే ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 13సార్లు బడ్జెట్‌ను సమర్పించగా ఈ రికార్డును సిద్దరామయ్య అధిగమించడం విశేషం. వచ్చే వారం నుంచి బడ్జెట్ మరింత వేగంగా కసరత్తు ప్రారంభించే అవకాశం ఉందని తెలుస్తోంది.



దేశవ్యాప్తంగా బీజేపీ గాలులు



- ఇండియా కూటమి అడ్రస్ గల్లంతు ఖాయం : అరుణ్‌సింగ్
- అబద్ధాలు చెప్పడంలో సీఎం, డీసీఎం పోటీ : ప్రహ్లాద్‌జోషి
- టార్గెట్ 28 కోసం 100 రోజుల రోడ్‌మ్యాప్

సమావేశంలో పాల్గొన్న బీజేపీ ప్రముఖులు


బెంగళూరు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా బీజేపీ గాలులు బలంగా వీస్తున్నాయని, ఈ గాలుల్లో ఇండియా మిత్రకూటమికి ఊహించని ఎదురుదెబ్బలు ఖాయమని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ అరుణ్‌సింగ్ పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించేందుకు బెంగళూరులోని ఓ ప్రైవేటు హోటల్లో సోమవారం జరిగిన కీలక సమావేశంలో ఆయన పాల్గొన్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర, పార్టీ జాతీయ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు బీఎస్ యడియూరప్ప, కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషితోపాటు మాజీ సీఎంలు బసవరాజ్ బొమ్మై, డీవీ సదానందగౌడ, ప్రతిపక్షనేత ఆర్. అశోక్ పాల్గొన్నారు. సమావేశం అనంతరం అరుణ్‌సింగ్ మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ అనుసరిస్తున్న బుజ్జగింపు రాజకీయాలు వారికే రివర్స్ కానున్నాయని జోస్యం చెప్పారు. కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి మాట్లాడుతూ పచ్చి అబద్ధాలు చెప్పడంలో సీఎం, డీసీఎం పోటీ పడుతున్నారని ఎద్దేవా చేశారు. కేంద్రం ఇస్తున్న ఉచిత బియ్యం పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం తనదిగా ప్రచారం చేసుకుంటూ గ్యారెంటీ ఖాతాలో వేసుకుందని ధ్వజమెత్తారు. హుబ్బళ్లిలో కరసేవకుడి అరెస్టుపై సీఎం చెప్పిన వన్నీ పచ్చి అబద్ధాలన్నారు. శ్రీకాంత్‌పై ఒకటి మినహా అన్ని కేసులను న్యాయస్థానాలు కొట్టివేశాయని పేర్కొన్నారు. పన్నులవాటా పంపిణీలో రాష్ట్రానికి ఎలాంటి అన్యాయం జరగడం లేదని, పైపెచ్చు యూపీఏ హయాంతో పోలిస్తే కేటాయింపులు బాగా పెరిగాయన్నారు. పదేళ్ల యూపీఏ హయాంలో రాష్ట్రానికి రూ.81,795 కోట్లు రావాల్సి ఉండగా రూ.9వేలకోట్లు మాత్రమే వచ్చాయన్నారు. ఎన్డీయే హయాంలో రూ.2,80,130 కోట్లు రాష్ట్రానికి వివిధ పథకాల కింద వచ్చాయన్నారు. ఇది గతంతో పోలిస్తే 240 శాతం అధికమన్నారు. గ్రాంటింగ్ ఎయిడ్ విషయానికి వస్తే 2004 నుంచి 2014వరకు యూపీఏ హయాంలో రాష్ట్రానికి రూ.60,799 కోట్లు రాగా, ఎన్డీయే హయాంలో 2014 నుంచి 2024 వరకు రూ.2,08,832 కోట్లు వచ్చాయన్నారు. ఇవి గతంతో పోలిస్తే 244 శాతం అధికమన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి డీజేహళ్లి, కేజీహళ్లి నిందితులు బ్రదర్స్‌గా కనిపిస్తున్నారని మాజీ ముఖ్యమంత్రి బొమ్మై ధ్వజమెత్తారు. బుజ్జగింపు రాజకీయాలకు కాలం చెల్లిందన్నారు. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం అన్ని వర్గాలను సమానంగా చూస్తోందన్నారు. అన్నభాగ్య పథకానికి కేంద్రం బియ్యం ఇస్తోందని, కాంగ్రెస్ ఇచ్చిన బియ్యం హామీ ఇంకా అమలు కావడం లేదన్నారు. శ్రీరాముడు తమకు కూడా దేవుడే నంటూ ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ తాజా వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ మొత్తానికి శ్రీరామచంద్రప్రభువు కాంగ్రెస్ నేతలకు జ్ఞానోదయం కల్పించారని వ్యాఖ్యానించారు.



హాజరైన కోర్ కమిటీ సభ్యులు

అభ్యర్థుల ఎంపికపై మాట్లాడొద్దు

కాగా ఈ సమావేశంలో జేడీఎస్‌తో పొత్తు దరిమిలా బీజేపీ బలంగా ఉన్నా నియోజకవర్గాలను గుర్తించాలని, కేంద్రప్రభుత్వ విజయాలను, ప్రత్యేకించి వికసిత భారతయాత్రను ప్రతిష్టాత్మకంగా తీసుకుని ప్రచారం చేయాలని నిర్ణయించారు. అభ్యర్థుల ఎంపికపై ఎవరూ మాట్లాడరాదని, అధిష్టానం నిర్ణయం వచ్చేంత వరకు వేచి చూడాలని తీర్మానించారు. జేడీఎస్‌తో పొత్తుకు సంబంధించి అధిష్టానం కీలక నిర్ణయం తీసుకున్న కారణంగా ఎన్నికల్లో ఆ పార్టీతో సమన్వయాన్ని ఏర్పాటు చేసుకుని ముందుకు సాగే దిశలో ఒక ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తే బాగుంటుందనే నిర్ణయానికి వచ్చారు. మొత్తం 28 లోక్‌సభ నియోజకవర్గాలను గెల్చుకునే దిశలో 100 రోజుల రోడ్ మ్యాప్‌ను సిద్ధం చేయనున్నారు. దేశానికి ప్రధాని నరేంద్ర మోదీయే గ్యారంటీ అనే నినాదాన్ని ప్రజల్లో బలంగా తీసుకెళ్లనున్నారు. బూత్‌స్థాయిలో 51 శాతం ఓట్లను సాధించే దిశలో వ్యూహాలకు పదును పెట్టనున్నారు. సమావేశంలో సీనియర్ నేత సీటీ రవితో పాటు పార్టీ కోర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1589.01	1,629.94
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	0	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	0	8,377
సామర్థ్యం (టీఎంసీలు)	10.22	69.96

గూడ్స్ వాహనం బోల్తా



బోల్తా పడిన వాహనం

రాయచూరు, జనవరి 8: ఇనుప తుక్కు సామానుతో వెళ్తున్న మిని గూడ్స్ వాహనం బోల్తా పడింది. సోమవారం తెల్లవారు జామున అరకేరా సమీపంలో సిరవార నుంచి కలబుర్గివైపు వెళుతున్న ఈ వాహనం అదుపు తప్పి బొల్తాగొట్టడంతో అందులో ప్రయాణిస్తున్న నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. వాహనం బొల్తాగొట్టిన ప్రదేశానికి అత్యంత సమీపంలోనే విద్యుత్ స్తంభం ఉండగా వాహనానికి విద్యుత్ ప్రమాదం తప్పిపోయింది. ప్రమాదంలో ప్రాణాపాయమేమీ జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

తాగునీరు లేక యాత్రికులకు ఇబ్బందులు



నడిచి వెళ్తున్న భక్తులు

కంప్లి, జనవరి 8: దక్షిణ కాశీగా పేరుపొందిన హంపిలో తాగునీటి వసతి ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు. ప్రధానమైన ఆలయాలు, మండపాల వద్ద తాగునీట వసతులు లేవు. నవదిబ్బ, పుష్కరేణి, విజయవిఠల దేవస్థానం, కోదండరామ, యంత్రోత్సాదక, పది చేతుల మారెమ్మ, కడ్లేకాళు గణపతి, లక్ష్మీనరసింహ ఆలయాలకు నడిచి వచ్చే భక్తులకు మంచినీటి ట్యాంకులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

చెరువును శభ్రం చేయాలి: ఎమ్మెల్యే

సిరుగుప్ప, జనవరి 8 : దాసాపూర్ తాగునీటి చెరువును శుభ్రం చేసి, వాడుకలోకి తేవాలని ఎమ్మెల్యే బీఎం నాగరాజు డిమాండ్ చేశారు. సిరుగుప్ప తాలుకాలోని దాసాపుర, గొంచిగేరి గ్రామాల మధ్య వున్న తాగునీటి చెరువు 30 యేళ్ల కింద మాజీ ఎమ్మెల్యే చంద్రశేఖరయ్య నేతృత్వంలో చెరువును ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి నేటి వరకు గ్రామాల ప్రజలు ఈ నీటి వాడుకుంటున్నారని, అయితే ఇటవల చెరువులో అక్కడక్కడ అపరిశుభ్రత నెలకొంది. వాటిని తొలగించి ప్రజలకు పరిశుభ్రం చేసి పైపులైన్ ద్వారా ప్రజలకు తాగునీటి వ్యవస్థ ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

మహిళ ఆత్మహత్య

గుంతకల్లుటౌన్, జనవరి8: అనంతపురం జిల్లా గుంతకల్లు పట్టణంలోని వాల్మీకినగర్‌లో నివాసముంటున్న ఆదిలక్ష్మి(24) సోమవారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణానికి చెందిన ఎస్ రాజుతో కర్ణాటక రాష్ట్రం రూపన్‌గుడి మండలం కమ్మరచేడు గ్రామానికి చెందిన ఆదిలక్ష్మితో ఏడు సంవత్సరాల క్రితం వివాహం అయ్యిందన్నారు. రాజు సెల్‌ఫోన్ షాపు నడుపుతూ జీవనం సాగిస్తున్నాడన్నారు. మధ్యాహ్నం రాజు షాపునకు వెళ్లగా ఆదిలక్ష్మి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. రాజు ఇంటికి వచ్చి తలుపులు బద్దలు కొట్టి లోపలకి వెళ్లారు. ఆదిలక్ష్మి ఉరికి వేళాడుతూ కనిపించింది. కొన ఊపిరితో ఉన్న ఆదిలక్ష్మిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆమె అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. పిల్లలు పుట్టలేదని మనస్తాపంతో ఆదిలక్ష్మి ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందన్నారు. కసాపురం పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.



నిరుపయోగంగా మారిన బస్టాప్



పాతబస్టాండ్‌లో రోడ్డుపైనే వేచి ఉన్న ప్రయాణికులు

దిష్టిబొమ్మల్లా బస్‌స్టాప్‌లు

● అవసరమైన చోట లేక ప్రయాణికులకు తప్పని పాట్లు

కంప్లి, జనవరి 8 : ప్రయాణికులకు నీడను అందించాల్సిన బస్టాప్‌లు నిరుపయోగంగా మారుతున్నాయి. ఎండా, గాలి, వాన, తగలకుండా ఏర్పాటు చేసిన బస్టాప్‌లు దిష్టిబొమ్మల్లా నిలిచిపోతున్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో బస్టాప్‌లు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కంప్లి పట్టణంలో పలు చోట్ల ఎమ్మెల్యే, ఎంపీ, పట్టణ నగరోత్సన్న నిధులతో బస్‌స్టాప్‌లు ఏర్పాటు చేశారు. బళ్లారి రోడ్డులో బాలికల కళాశాల ఎదురుగా, గంగావతి రోడ్డులో జోగి కాలువ వద్ద, ఏపీఎంసీ వద్ద ఉన్న బస్‌స్టాప్‌తో ప్రయాణికులకు ఎలాంటి ప్రయోజనంలేకుండా నిరుపయోగంగా మారింది. లక్షల ప్రజానిధులు మాత్రం వృథాగా మారాయి. ఉపయోగం లేని ప్రాంతాల్లో బస్‌స్టాప్‌లు ఏర్పాటు చేయడంతో వాటిని ఎవరూ వినియోగించుకోవడం లేదన్నారు. అంబేడ్కర్ సర్కిల్ కూడలిలో హోస్పేట పట్టణానికి వెళ్లే ప్రయాణికులకు, కురుగోడు బస్టాండులోని ప్రయాణికులకు ఇబ్బంది కలుగుతోందని పలుమార్లు విన్నవించినా అధికారుల్లో చలనం లేకుండాపోయింది. వర్షాలకు, గాలి, ఎండకు ఇబ్బందులు పడుతూ ప్రయాణిస్తున్నారు. ప్రయాణికులకు ఉపయోగపడేలా బస్‌స్టాప్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

రైల్వే ఉద్యోగుల ఆందోళన

బళ్లారి సిటీ, జనవరి 8: తమ డిమాండ్లు నెరవేర్చాలని దక్షిణపశ్చిమ రైల్వే మజ్దూర్ యూనియన్ బళ్లారి బ్రాంచ్, ఆల్‌ఇండియా రైల్వేపెడరేషన్ న్యూఢిల్లీ సంయుక్తాధ్వర్యంలో సోమవారం బళ్లారి రైల్వేస్టేషన్‌లో రైల్వే ఉద్యోగులు సమ్మె చేశారు. ఈసందర్భంగా దక్షిణ పశ్చిమ రైల్వే మజ్దూర్ యూరియన్ హుబ్లీ డివిజన్ సహకార్యదర్శి బళ్లారి బ్రాంచ్ కార్యదర్శి, ప్రేమ్ సభ్యుడు ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ 2004 తరువాత రైల్వే శాఖలో ఉద్యోగాలు పొందిన వారికి సేషనల్ పెంక్షన్ స్కీమ్(ఎన్‌పీఎస్) ను రద్దు చేసి ఓల్ పెంక్షన్ స్కీమ్(ఓపీఎస్)అమలు చేయాలని డిమాండ్ చేశారు. అదే ఎన్‌పీఎస్‌లో ఉద్యోగి జీతం నుంచి 10శాతం రికవరీ, ప్రభుత్వం 14శాతంతో కలిపి 24శాతం అవ్వగా అందులో కేవలం 60శాతం మాత్రమే పెంక్షన్‌గా ఇస్తారు. మిగిలిన 40శాతం ఎక్కడ ఉంటుందో కూడా ఉద్యోగులకు తెలియదన్నారు. సమ్మె 11వరకు కొనసాగుతుందని తెలిపారు. ఈసమ్మెలో ఎం.విజయ్‌కుమార్ ఉద్యోగులు పాల్గొన్నారు.



రైల్వేస్టేషన్ ప్రవేశ ద్వారం వద్ద ఆందోళన చేస్తున్న ఉద్యోగులు

నదిలోకి 4 లక్షల చేప పిల్లలు



చేప పిల్లలను వదులుతున్న మత్స్యశాఖ అధికారులు

బళ్లారి సిటీ, జనవరి 8: ప్రధాన మంత్రి మత్స్య సంపద పథకం కింద తుంగభద్ర నదిలో మత్స్య శాఖ అధికారులు 4 లక్షల చేప పిల్లలను సోమవారం వదిలారు. ఈ సందర్భంగా శాఖ జాయింట్ డైరెక్టర్ జి.షడక్షరి మాట్లాడుతూ.. రవ్వ, కట్ల, సాధారణ ఖడ్గమృగం, కామన్ కర్ప్, గ్లాస్ కర్ప్ జాతులను నదిలోకి వదిలామని తెలిపారు. డీఎంఎఫ్ మంజూరు కింద కంప్లిలో చేపల వేలం బ్లాక్‌ను నిర్మించనున్నారు. భూమి ఉన్న మత్స్యకారులకు 'మత్స్యాశ్రయ' పథకం కింద వసతి సౌకర్యం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ శివన్న, అసిస్టెంట్ డైరెక్టర్ చంద్రశేఖర్, కంప్లి మత్స్యకారుల సహకార సంఘం అధ్యక్షుడు చిన్నరాజు, షణ్ముగం, నాదేశ్, విరూపాక్షి, రాజా, గట్టెప్ప, పంపాపతి, కృష్ణ పాల్గొన్నారు.

'యువ నిధి' పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

● అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలి: డీసీ



జిల్లాధికారి చంద్ర శేఖర్ నాయక్

రాయచూరు జనవరి 8 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'యువ నిధి' పథకాన్ని జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లాధికారి చంద్రశేఖర్ నాయక్ సోమవారం ప్రకటించారు. యువ నిధి పథకం లబ్ధిదారుల ఎంపికకు అర్హతలను ఇప్పటికే ప్రభుత్వం ప్రకటిం చిందని, 2022-23 విద్యాసంవత్సరంలో డిగ్రీ, లేదా డిప్లమా పూర్తి చేసిన వారు దరఖాస్తు చేయవచ్చన్నారు. కోర్సు పూర్తి చేసి 6 నెలల్లోగా ఉద్యోగం రాని వాళ్ల దరఖాస్తుకు అర్హులన్నారు. డిగ్రీ అర్హత ఉన్నవారికి రూ.3 వేలు, డిప్లమా అర్హత ఉన్నవారికి రూ.1500 ప్రతినెలా ప్రభుత్వం భృతిగా అందజేస్తుందన్నారు. ఈ అవకాశం గరిష్టంగా రెండేళ్ల పాటు అభ్యర్థికి ఉద్యోగం వచ్చే వరకు కొనసాగుతుందన్నారు. ఇందుకు సంబంధించి అభ్యర్థులు తమకున్న అర్హత ఆధారంగా జిల్లాలోని వారందరు ఉచితంగా ఈ-సేవా ద్వార నమోదు చేసుకోవచ్చన్నారు. వివరాల కోసం 8073610442, 9880802184, 18005999918 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

పగటి వేషధారులను ఆదుకోవాలి

● కళాకారులుగా గుర్తించాలని సంఘం డిమాండ్



కళా ప్రదర్శనలో పాత దరోజీ పగటి వేషధారులు

కంప్లి, జనవరి 8 : పగటిపూట వేషాలు వేసి జీవనం గడుపుతున్న వారిని ప్రభుత్వాలు కళాకారులుగా గుర్తించి ఆదుకోవాలని నాడోజా బుర్రకథ దరోజీ ఈరమ్మ ఫౌండేషన్ అధ్యక్షుడు అశ్వరామ కోరారు. సోమవారం దేవసముద్రం గ్రామంలో పాత దరోజీ పగటి వేషధారులు ఇంటింటా నాటకోత్సవం నిర్వహించారు. రామ, లక్ష్మణ, ఆంజనేయ, శూర్పణఖ తదితర వేషాలతో కళా కారులు ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా రామ్ మాట్లాడుతూ ఎన్నో తరాలుగా పగటి వేషాలు వేసి జీవనం గడుపుతున్నామని, అలాంటి కళాకారులకు ప్రభుత్వ సదుపాయాలు అందించి ఆదుకోవాలని కోరారు. అలాగే ప్రతి జిల్లాలో కళాకారులకు నిగమలు కూడా ఏర్పాటు చేసి ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, సభ్యులు, కళాకారులు అశ్వరామన్న, రుద్రాక్షిరప్ప, దొడ్డ లాలెప్ప, మారేష్, నాగరాజు, మంజునాథ్, రాఘవేంద్ర, సోమశేఖర్, ధూపం జంబన్న తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం : ఐజీ

బళ్లారిరూరల్, జనవరి 8 : క్రీడలతో మానసిక ఉపశమనం సాధ్యమని ఐజీ లోకేష్ కుమార్ సూచించారు. సోమవారం నగరంలో నిపోలీసు జింఖానాలో నిర్వహించిన జేఎస్‌డబ్ల్యూ జింఖానా స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జేఎస్‌డబ్ల్యూ కప్ టెన్నిస్ టోర్నమెంట్‌ను మూడు రోజుల పాటు నిర్వహించారు. ఈ క్రీడాపోటీలకు బళ్లారి జిల్లాతో పాటు ఉత్తర కర్ణాటక, దక్షిణ కర్ణాటక నుంచి దాదాపు 500 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. సింగిల్స్‌లో 120 మంది, 140 మంది డబుల్స్‌లో పాల్గొన్నారు. ఇందులో సూర్యప్రకాష్, డాక్టర్ అరవింద్ పాటిల్, ఉదయ్ భాస్కర్, విరుపాక్షిరెడ్డి, మంజునాథ, దావణగెర మంజునాథ్, విరుపాక్షి రెడ్డిలు గెలుపొందిన టెన్నిస్ క్రీడాకారులను అభినందించారు. అనంతరం బహుమతులను అందజేసేందుకు ఐజీ లోకేష్ కుమార్, కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, ఏడీసీ మహమ్మద్ జుబేరా, ఎస్పీ రంజిత్ కుమార్ భండారిక్రీడల్లో గెలుపొందిన వారికి వారి చేతుల మీదుగా బహుమతులను అందజేశా రు. ఉదయభాస్కర్, జేఎస్‌డబ్ల్యూ అధ్యక్షుడు మురుగన్, సెక్రెటరీ జీఎం రవి రాజశేఖర్ రెడ్డి, కంద్రా సతీష్ కుమార్, పోలీసు జింఖానా ప్రెసిడెంట్ జితేంద్ర పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న ఐజీ లోకేష్ కుమార్

ఘనంగా సంక్రాంతి సంబరాలు


బళ్లారిరూరల్, జనవరి 8 : ఏకలవ్య ట్రస్టు ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. తాలుకాలోని భైరదేవనహళ్లి మొరార్జీ దేశాయ్ వసతి పాఠశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా న్యాయవాది కందా సతీష్ బాబు, కెనరా బ్యాంకు రీజనల్ మేనేజర్ మురళీ కృష్ణ, విస్తారా న్యూస్‌చానల్ మేటి శశిధర్‌లు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో శశిధర్ మాట్లాడుతూ పండుగలను జరుపుకుని సంప్రదాయాలను కాపాడుకోవాలన్నారు. పలువురు వక్తలు భోగి మంటలు, సంక్రాంతి ముగ్గులు, హరిదాసు విన్యాసాలు, పండుగ సందర్భంగా కోళ్ల పందాలు, కొత్త కుండలో పాలు పొంగించడం, పలు గ్రామాల్లో గంగిరెద్దుల విశేషాల గురించి వివరించారు.ఈ సందర్భంగా రంగుల ముగ్గుల పోటీలు, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఇందులో గెలుపొందిన విద్యార్థులకు ఏకలవ్య ట్రస్టు అధ్యక్షుడు చంద్రశేఖర్ బహుమతులను ప్రదానం చేశారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అనసూయ, పుష్ప చంద్రోశఖర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



చిన్నారుల నృత్య ప్రదర్శన

మహనీయుల జయంతులను ఘనంగా నిర్వహించాలి : ఏడీసీ

బళ్లారి సిటీ, జనవరి 8: మహనీయుల జయంతులను అర్థవంతంగా నిర్వహించాలని బళ్లారి జిల్లా ఏడీసీ మహ్మద్ జుబేర తెలిపారు. నగరంలోని కలెక్టరేట్ కేస్వాన్ హాల్లో సోమవారం వివిధ ప్రముఖుల జయంతి ఉత్సవాలపై ఏర్పాటు చేసిన ముందస్తు సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. జనవరి 15న శివయోగి సిద్దరామయ్య జయంతి, జనవరి 19న మహాయోగి వేమన జయంతి, 21న నిజశరణ అంబిగర చౌడయ్య జయంతిని జిల్లా యంత్రాంగం అర్థవంతంగా నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ కలెక్టర్ (ఏడీసీ) మహ్మద్ జుబేర తెలిపారు. ప్రతి సంవత్సరం తరహాలోనే ఈసారి కూడా పలువురు ప్రముఖుల జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించాలన్నారు. ఇందుకు అవసరమైన సన్నాహాలు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో మహనీయలపై ప్రత్యేక ఉపన్యాసం, ఆయా సంఘాల్లో విద్యారంగంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సన్మానిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో సంఘం నాయకులు తమ సూచనలు చేశారు. ఈసందర్భంగా జిల్లాస్థాయి వివిధ శాఖల అధికారులు, కన్నడ సాంస్కృతిక శాఖ సహాయ సంచాలకులు నాగరాజు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఏడీసీ మహ్మద్ జుబేర

హంపి ఉత్సవాలకు ప్రణాళిక రూపొందించండి : డీసీ



సమావేశంలో మాట్లాడుతున్న డీసీ దివాకర్, ఎమ్మెల్యే గవియప్ప

హొసపేట, జనవరి 8: చారిత్రక హంపి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని, దానికి తగిన ప్రణాళికలను రూపొందించాలని విజయనగర డీసీ దివాకర్ అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక ఎమ్మెల్యే గవియప్ప ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 2నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఉత్సవాలను ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నిర్వహించేందుకు కృషి చేస్తున్నామని, ఎమ్మెల్యేలతో పాటు జిల్లాలోని ప్రజాప్రతినిధులందరి సలహాలతో ఉత్సవాల ఏర్పాట్లు చేపడ్తామన్నారు. పలు బాధ్యతలకు కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. ఉత్సవాల్లో మూడు వేదికలు నిర్మిస్తున్నట్లు, విరూపాక్షేశ్వరుని సన్నిధిలో భరతనాట్యం,శాస్త్రీయ సంగీతం, సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రాధాన్యమిస్తామన్నారు. వంటల పోటీ, రంగోలీ పోటీలు, కుస్తీపోటీలతో గ్రామీణ వా తావరణం నెలకొల్పుతామన్నారు. పర్యావరణ హితంగా బ్యానర్లు, పోస్టర్లు ఏర్పాటు చేస్తామన్నారు. విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే గవియప్ప, జీపీఎం సీఐఓ సదాశివ ప్రభు, అసిస్టెంట్ కమిషనర్ మహ్మద్ ఆలీ అక్రమ్‌షా తదితరులు పాల్గొన్నారు.

హోసూరు జోన్

హత్య కేసులో నిందితుల అరెస్ట్

హోసూరు(క్రైం) జనవరి 8: హత్య కేసులో నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. హోసూరు సమీపంలోని బేగేపల్లికి చెందిన తిమ్మరాజ్ (40), అతని భార్య పుష్పలతలు స్థానికంగా కిరాణ దుకాణం నిర్వహిస్తున్నారు. 5వ తేదీ సాయంత్రం తిమ్మరాజు తన సోదరుడి దుకాణంలో టీ తాగుతూ కుర్చుని ఉండగా అదే సమయంలో ద్విచక్ర వాహనంలో వచ్చిన ముగ్గురు గుర్తు తెలియని దుండగులు తిమ్మరాజు మెడపై ఇనుప రాడ్‌తో దాడి చేశారు. రక్తపు మడుగుల్లో పడి ఉన్న తిమ్మరాజును అదే ప్రాంతానికి చెందిన కొందరు వ్యక్తులు హోసూరు ప్రైవేట్ ఆసుపత్రికి ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. సమాచారం అందుకున్న హోసూరు డీఎస్పీ బాబు, సిప్‌కాట్ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి ఆరా తీశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. విచారణలో తిమ్మరాజు హత్య కేసులో రామనాథపురం జేఎం2 కోర్టులో ముగ్గురు వ్యక్తులు హాజరయ్యారు. బాగలూరు డెంకణీకోట సమీపంలోని మంజునాథ లేఅవుట్‌కు చెందిన మూర్తి(20), బాగలూరు సమీపాన కొత్తపల్లికి చెందిన రాజకుమార్ (22), బేగేపల్లికి చెందిన కిరణ్ (22)లుగా గుర్తించారు. పోలీసులు వారిని కస్టడీకి తీసుకుని తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

వరద బాధితులకు వెబ్‌టెక్ ఫ్యాక్టరీ చేయూత

హోసూరు(కృష్ణగిరి) జనవరి 8: వరద బాధితులకు వెబ్‌టెక్ సంస్థ చేయూత అందించింది. భారీ వర్షాల కారణంగా తిరునల్వేలి,తంజావూరు, తూత్తుకుడి, మదురై ప్రాంతాల వాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో వంట సామగ్రి బియ్యం, కందిపప్పు, చక్కెర, ఉప్పు తదితర నిత్యావసరాలు నెలకు సరిపడా వస్తువులు సుమారు రూ.8లక్షల సామగ్రిని వాహనంలో తరలించారు. కలెక్టర్ సరయు వాహనానికి పచ్చజెండా చూపారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇంటర్వ్యూ అసిస్టెంట్ పుష్పా, వెబ్‌టెక్ కర్మాగార డిప్యూటీ జనరల్ మేనేజర్ కిరణ్‌కుమార్, ఇండస్ట్రియల్ హెల్త్ సేఫ్టీ డైరెక్టర్ సబీనా, ఎన్నికల అధికారి జైశంకర్ అధికారులు పాల్గొన్నారు.



నిత్యావసరాల వాహనానికి పచ్చజెండా ఊపుతున్న కలెక్టర్ సరయు

ఘనంగా పొంగల్

హోసూరు(మత్తిగిరి), జనవరి 8: పొంగల్ సందర్భంగా లబ్ధిదారులకు కానుకలు అందజేశారు. హోసూరు సమీపంలోని మత్తిగిరిలో జిల్లా డంబ్ అండ్ డెఫ్ సంఘం తరపున సమత్వ పొంగల్ పండుగను అర్థవంతంగా నిర్వహించారు. సమత్వ పొంగల్‌లో భాగంగా సంప్రదాయ క్రీడా పోటీలు జరిపారు. కార్యక్రమంలో పలువురు డంబ్ అండ్ డెఫ్ సంఘం పలువురు పాల్గొన్నారు. వివిధ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు కూడా అందజేశారు. సుమారు 70 మందికి పైగా చీరలు, పంచెలు, ఇతర వంటసామగ్రి సంక్షేమ సహాయం అందజేశారు. ఇందులో ట్రస్టీ ఎగ్జిక్యూటివ్ మాజీ కౌన్సిలర్లు అధ్యక్షుడు సురేశ్, తమిళనాడు డంబ్ అండ్ డెఫ్ సంఘం ప్రధాన కార్యదర్శి మోహన్, కృష్ణగిరి సంఘం కార్యనిర్వాహకులు బలరామన్, జయవేల్, గోవర్ధన్, జైశంకర్, ప్రకాశ్, జీవా, సంఘ మహిళల బృందం గాయత్రి, రాధ తదితరులు పాల్గొన్నారు.



కానుకలు అందజేస్తున్న నిర్వాహకులు

సీపీఎం ఆధ్వర్యంలో నిరసన

హోసూరు(సిప్‌కాట్), జనవరి 8: వరదసాయం అందించని కేంద్ర ప్రభుత్వ తీరును ఖండిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. హోసూరులోని హెడ్‌పోస్టాఫీస్ ఎదురుగా ఆందోళన నిర్వహించారు. భారీ వర్షం కారణంగా చెన్నై, చెంగల్‌పట్టు, కాంచీపురం, తిరువళ్లూరు, తూత్తుకుడి, నెల్లై, విరుదునగర్, తెన్‌కాశఖూ, కన్యాకుమారి తదితర జిల్లాలను మిచౌంగ్ తుఫాను, భారీ వర్షాల వరదల కారణంగా జాతీయ విపత్తు ప్రభావిత జిల్లాలుగా ప్రకటించి రూ.21,692 కోట్లు కేంద్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన ప్రదర్శన చేపట్టారు. నిరసనలో మున్సిపల్ కార్యదర్శి శంకరయ్య అధ్యక్షత వహించగా జిల్లా ఉప కార్యదర్శి నూరు, చిన్న వ్యాపారుల సంఘం జిల్లా కార్యదర్శి చిన్నస్వామి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సెందిల్, జిల్లా కార్యదర్శి ఆదిల్, రాష్ట్ర కమిటీ సభ్యుడు మాదయ్య పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

డెంటల్ అసోసియేషన్ శాఖ ప్రారంభం

హోసూరు, జనవరి 8: ఇండియన్ డెంటల్ అసోసియేషన్ హోసూరు శాఖను సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. తమిళనాడు శాఖ కార్యదర్శి డాక్టర్ సెందామరై కన్నన్ అధ్యక్షత వహించారు. ప్రత్యేక అతిథిగా డాక్టర్ షణ్ముగవేల్, గౌరవ అతిథిగా చీఫ్ డెంటల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా నుంచి డాక్టర్ సేదుమాదవన్, డాక్టర్ పోన్‌రాజ్, గోకుల్‌రాజ్, రాష్ట్ర ఉప కార్యదర్శి కలైసెల్వన్ జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. కార్యక్రమంలో హోసూరు శాఖాధిపతి కలైసెల్వన్, అరుణ సదేషన్, కార్యదర్శిగా గజపతి రాజన్, కోశాధికారిగా కవితా యువరాజ్, ఇండియన్ మెడికల్ అసోషియేషన్ సభ్యులతోపాటు పలువురు పాల్గొన్నారు. కార్యక్రమంలో జోనేష్, అరుణ్‌కుమార్ ఉన్నారు.



ప్రారంభోత్సవంలో పాల్గొన్న డెంటల్ డాక్టర్లు

గైర్హాజరైన అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం

రాయచూరు జనవరి 8 : త్రైమాసిక కేడీపీ సభకు హాజరు కాకుండా నిర్లక్ష్యం వహించిన అధికారుల జాబితాను సిద్ధం చేసి ప్రభుత్వానికి ఫిర్యాదు చేయాలని రూరల్ ఎమ్మెల్యే దద్దల బసనగౌడ తాలూకా పంచాయతీ ఈఓను ఆదేశించారు. సోమవారం నగరంలోని జడ్పీ సమావేశ మందిరంలో రాయచూరు తాలూకా త్రైమాసిక కేడీపీ ప్రగతి పరిశీలన సభ నిర్వహించారు. సభకు అధ్యక్షత వహించిన రూరల్ ఎమ్మెల్యే పలు శాఖల అధికారులు గైర్హాజరుకావడాన్ని తీవ్రంగా పరిగణించారు. ఆ శాఖలకు సంబంధించిన సమాచారం లేకుండా సభ నిర్వహించడంలో అర్థమేముందని అధికారులను నిలదీశారు. కొద్దిసేపు సభ నిర్వహణకు ఆటంకం ఏర్పడగా అనంతరం ఇతర శాఖలకు చెందిన అధికారులతో ఉన్న సమాచారం మేరకు సభను కొనసాగించారు. ఈ సందర్భంగా సభలో మాట్లాడిన ఎమ్మెల్యే, ప్రభుత్వం గ్రామీణ ప్రాంతంలో మొత్తం 3500 మంది రైతులకు ఉచిత పంప్‌సెట్‌లను అందజేసిందన్నారు. ఆ పంప్‌సెట్‌ల పరిధిలోనే రైతులు సాగు చేసే భూములు పూర్తిగా ఆయకట్టుగా గుర్తించి ప్రభుత్వ పరంగా సౌకర్యాలు కల్పించాలన్నారు.



కేడీపీ సమావేశంలో మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే దద్దల బసనగౌడ

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంచ్...

హర్ గోవింద్ ఖొరానా (జయంతి)



నోబెల్ బహుమతి పొందిన ప్రఖ్యాత జీవశాస్త్రజ్ఞుడు హర్ గోవింద్ ఖొరానా 1922 జనవరి 9న అప్పటి పంజాబ్ పరిధి లోని రాయ్‌పూర్‌లో జన్మించారు. భారత సంతతికి చెందిన అమెరికన్ జీవశాస్త్రజ్ఞుడు. ఉత్తర అమెరికాలోని మూడు యూనివర్శిటీలకు ఫ్యాకల్టీగా వ్యవహరించారు. మూడు న్యూక్లియోటైడ్‌ల అమరికతో జన్యువులు పొందుపరచబడి ఉన్నాయని కనుక్కొని కృత్రిమ జీన్ (డీఎన్ఏ)ను ప్రయోగశాలలో సృష్టించారు. ఆధునిక జీవశాస్త్రములో విప్లవం సాధించి 1968లో 'నోబెల్ ప్రైజ్' గెలుపొందారు. 1987లో 'నేషనల్ మెడల్ ఆఫ్ సైన్స్' అందుకున్నారు. 2011 నవంబరు 9న కన్నుమూశారు.

పాల్ఘాట్ రఘు (జయంతి)



'పద్మశ్రీ' గ్రహీత పాల్ఘాట్ రామస్వామి రఘు 1928 జనవరి 9న బర్మాలోని రంగూన్‌లో (ప్రస్తుతం మయన్మార్‌లోని యాంగోన్) జన్మించారు. కర్ణాటక సంగీత విద్వాంసులు. పండిట్ రవిశంకర్, హరిప్రసాద్ చౌరాసియా, శివకుమార్ శర్మ వంటి వారితో కలసి దేశవిదేశాలలో కచేరీలు ప్రదర్శించారు. వెస్లి యన్, శాండిగో, కాలిఫోర్నియా యూనివర్శిటీలలో విజిటింగ్ ప్రొఫెసర్‌గా వ్యవహరించారు. ప్రత్యేకించి మృదంగం విద్యార్థులకు తరగతులు నిర్వహించేవారు. సంగీత నాటక అకాడమీ, కలైమామణి, తదితర పురస్కారాలు అందుకున్నారు. 2009 జూన్ 2న కన్నుమూశారు.

మహేంద్రకపూర్ (జయంతి)



'పద్మశ్రీ' గ్రహీత మహేంద్రకపూర్ 1934 జనవరి 9న అమృత్‌సర్‌లో జన్మించారు. నేపథ్యగాయకుడిగా దాదాపు ఐదు దశాబ్దాలపాటు హిందీతోపాటు గుజరాతీ, పంజాబీ, భోజ్‌పురి, మరాఠీ అనేక ప్రాంతీయ భాషలలో వేలకొద్దీ పాటలు పాడారు. గుమ్రాహ్, హమ్‌రాజ్ సినిమాల పాటలు ఎంతో పేరొందాయి. మనోజ్‌కుమార్ నటించిన 'ఉప్‌కార్' సినిమాలో పాడిన దేశభక్తి గీతం జాతీయ గుర్తింపు పొందింది. పలు అవార్డులు అందుకున్నారు. 2008 సెప్టెంబరు 7న కన్నుమూశారు.

ఫరాఖాన్ (పుట్టినరోజు)



ఫరాఖాన్ 1965 జనవరి 9న ముంబైలో జన్మించారు. బాలీవుడ్‌లో దర్శకురాలిగా, నిర్మాతగా, నటిగా, నృత్యకారిణిగా, కొరియోగ్రాఫర్‌గా పేరొందారు. 80కుపైగా సినిమాలలో వందకుపైగా పాటలకు కొరియోగ్రఫీ అందించారు. ఒక జాతీయ, ఆరు ఫిల్మ్‌ఫేర్ అవార్డులు అందుకున్నారు. తమిళ సినిమాలతోపాటు అంతర్జాతీయ ప్రాజెక్టులలోనూ పనిచేశారు. మైఖేల్‌జాక్సన్ 'థ్రిల్లర్'తో స్ఫూర్తి పొంది నృత్యంవైపు ఆకర్షితులయ్యారు. బుల్లి తెరపై పలు కార్యక్రమాలకు హోస్ట్‌గా ఉన్నారు.

ఫర్హాన్ అక్తర్ (పుట్టినరోజు)



ఫర్హాన్ అక్తర్ 1974 జనవరి 9న ముంబైలో జన్మించారు. హిందీ సినీరంగంలో పేరొందిన జావేద్ అక్తర్ కుమారుడు. తండ్రి బాటలో స్క్రీన్ రైటర్‌గానే కాక నటుడు, దర్శకుడు, నేపథ్యగాయకుడు, నిర్మాతగా, బుల్లితెర వ్యాఖ్యాత ఇలా బహుముఖ ప్రజ్ఞాశాలిగా రాణించారు. 'ది ఫకీర్ ఆఫ్ వెనిస్' సినిమాతో కెరీర్ ప్రారంభించారు. 4 ఫిల్మ్‌ఫేర్ అవార్డులతోపాటు ఉత్తమ సపోర్టింగ్ యాక్టర్ పురస్కారం పొందారు.

హిమాదాస్ (పుట్టినరోజు)



హిమాదాస్ 2000 జనవరి 9న జన్మించారు. అస్సాం రాష్ట్రానికి చెందిన స్ప్రింటర్. అభిమానులచే 'ఢింగ్ ఎక్స్‌ప్రెస్'గా పిలువ బడ్డారు. 2018 ఏషియన్ గేమ్స్‌లో 400 మీటర్ల పరుగు విభాగంలో సత్తా చాటుకున్నారు. ఐఏఏఎఫ్ వరల్డ్ అండర్ 20 ఛాంపియన్‌షిప్స్‌లో భారత అథ్లెట్‌గా బంగారుపతకం సాధించారు. 2018లో 'అర్జున' అవార్డు పొందారు. అస్సాం పబ్లిక్ సర్వీస్ కమి షన్‌చే 2021లో పోలీసు శాఖలో నేరుగా డీఎస్పీ హోదాతో నియమితులయ్యారు.

స్ఫూర్తిప్రదాత టీచర్ బీవీ చంద్రశేఖర్



విజేతలకు ప్రశంసాపత్రం అందజేత

బాగేపల్లి, జనవరి 8: పట్టణంలోని ప్రభుత్వ బాలుర హైస్కూల్‌లో సుమారు పదేళ్లపాటు సేవలందించిన బీవీసీగా పేరొందిన ఉత్తమ ఉపాధ్యాయుడు బీవీ చంద్రశేఖర్ ఆదర్శప్రాయులని గణితశాస్త్ర అధ్యాపకుడు ఎన్ఎన్ నాగరాజు విద్యార్థులకు సూచించారు. క్రమశిక్షణకు దక్షతకు మారుపేరుగా నిలిచిన బీవీ చంద్రశేఖర్ తమను భౌతికంగా వీడి ఐదేళ్లు అవుతోందని, ఆయన జ్ఞాపకార్థం సోమవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. చంద్రశేఖర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఆయన పేరిట క్విజ్ పోటీలు నిర్వహించారు. ఎస్ఎస్ఎల్‌సీలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ బీఈఓ వెంకటరామ్, బాలుర హైస్కూల్ ఉపాధ్యాయులు వెంకటేశ్, అధ్యాపకుడు ఎన్ఎన్ రాగరాజు, రిటైర్డు మిలిటరీ సైనికుడు అమరనాథ బాబు, పద్మావతి, ఈశ్వరప్ప, కేవీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బసవణ్ణను సాంస్కృతిక రాయబారిగా ప్రకటించాలి

▸ సీఎంకు లింగాయత మఠాధిపతుల వినతి



సీఎం సిద్దరామయ్యకు బసవణ్ణ చిత్రపటం అందజేస్తున్న మఠాధిపతులు

బెంగళూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రపంచవ్యాప్తంగా తన వచన సాహిత్యంతో ఎంతగానో ప్రభావితం చేసి బలమైన ముద్ర వేసిన బసవణ్ణను సాంస్కృతిక రాయబారిగా ప్రకటించాలని లింగాయత మఠాధిపతులు ముఖ్యమంత్రి సిద్దరామయ్యను కోరారు. బెంగళూరులో సోమవారం లింగాయత మఠాధిపతుల బృందం ముఖ్యమంత్రికి ప్రత్యేక వినతిపత్రాన్ని అందజేశారు. మంత్రిమండలి సమావేశంలో దీనిపై చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని ముఖ్యమంత్రి సిద్దరామయ్య మఠాధిపతులకు హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రిని కలసిన మఠాధిపతుల బృందంలో తరళబాళు జగద్గురు శివరాత్రి దేశికేంద్ర స్వామిజీ, శ్రీశైల జగద్గురు ఫకీర దింగాళేశ్వరస్వామిజీతోపాటు ప్రముఖ పీఠాధిపతులు డాక్టర్ రాజశేఖర్ శివాచార్య, డాక్టర్ జగద్గురు చెన్నబసవానందస్వామిజీ, వీరభద్ర శివా కడకంచి, అక్క అన్నపూర్ణతాయి, జ్ఞానప్రకాశ స్వామిజీ, డాక్టర్ గంగాంబికె అక్క, మాదార చెన్నయ్య సహా 48మంది స్వామిజీలు ఉన్నారు. మంత్రులు ఎంబీ పాటిల్, ఈశ్వర్‌ఖండ్రె, బసవసమితి అధ్యక్షుడు డాక్టర్ అరవింద జత్తి కూడా ఈ సందర్భంగా హాజరయ్యారు.

26 నుంచి రాజ్యాంగ జాగృతి యాత్ర

రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రాజ్యాంగ, జాతీయ ఐక్యతా సమావేశాన్ని రాష్ట్రవ్యాప్తంగా వైభవంగా జరపాలని ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యమంత్రి సిద్దరామయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. వీటి వివరాలను మంత్రి డాక్టర్ హెచ్‌సీ మహదేవప్ప మీడియాకు తెలిపారు. జనవరి 26నుంచి అన్ని గ్రామ పంచాయతీలలో ఈ జాథా సంచరిస్తుందన్నారు. ఇదే సందర్భంగా శకటాలను ప్రదర్శిస్తామన్నారు. ఫిబ్రవరి 24 నుంచి రెండురోజులపాటు ప్యాలెస్ మైదానంలో ముగింపు సమావేశాన్ని నిర్వహిస్తామన్నారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషియల్ ఎకనామిక్ చేంజ్ లా స్కూల్ ఆఫ్ ఇండియా యూనివర్సిటీ సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. సమావేశంలో మంత్రులు హెచ్‌సీ మహదేవప్ప, కేహెచ్ మునియప్ప, ప్రియాంక ఖర్గే, హెచ్‌కే పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు సారథ్యాన్ని బలోపేతం చేద్దాం

▸ బనశంకరిలో జీడీ నెల్లూరు వాసుల ఆత్మీయ సమ్మేళనం

బెంగళూరు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబు సారథ్యాన్ని బలోపేతం చేయడం ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను రక్షించుకుందామని చిత్తూరు జిల్లా గంగాధరనెల్లూరు పార్టీ ఇన్‌చార్జ్ డాక్టర్ థామస్ పిలుపునిచ్చారు. ఆదివారం బనశంకరిలోని శ్రీహరి కల్యాణమండపంలో జీడీ నెల్లూరు నియోజకవర్గ పరిధికి చెందిన పార్టీ అభిమానులు, ప్రవాసాంధ్రులతో ఆత్మీయ సమ్మేళనం జరిగింది. తెలుగుదేశం పార్టీ ప్రభావశీలుల గుర్తింపు విభాగం ప్రధాన కార్యదర్శి భీమినేని చిట్టిబాబునాయుడు, నియోజకవర్గ ముఖ్య నాయకులు రుద్రయ్యనాయుడు, లోకనాథరెడ్డి, చెంగలరాయ యాదవ్, జయశంకర్ నాయుడు, స్వామిదాస్, రాజేంద్రన్‌తోపాటు పలువురు పాల్గొన్నారు. బనశంకరి, హనుమంతనగర్, ఇట్టిమడు ప్రాంతాలలో నివసించే జీడీ నెల్లూరు ప్రాంత వాసులు పెద్దసంఖ్యలో భాగస్వామ్యులయ్యారు. ఈసందర్భంగా డాక్టర్ థామస్ మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్లపాలనలో అభివృద్ధి దారి తప్పిందని నిరంతరం అక్రమాలు, అరాచకాలు సాగుతున్నాయన్నారు. ఏపీకి పూర్వవైభవం రావాలంటే ప్రవాసాంధ్రులు ఒక నిర్ణయంతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో మీ సొంతూళ్లకు వచ్చి టీడీపీని గెలిపించాలని కోరారు. ఎమ్మెల్సీ కంచెర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ బెంగళూరులో రాయలసీమ జిల్లాలకు చెందినవారు లక్షలాదిమంది నివసిస్తున్నారని, వారందరినీ ప్రాంతాలవారీగా కలిసేందుకు ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రవాసాంధ్రులు వచ్చే ఎన్నికల్లో సైనికుల్లా పని చేయాలని కోరారు. పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ సభ్యులు భూమిరెడ్డి రాంభూపాల్‌రెడ్డి వీడియో ద్వారా తన సందేశాన్ని వినిపించారు. జీడీ నెల్లూరు పరిధికి చెందిన బెంగళూరు విభాగం సభ్యులు కటికపల్లి లోకేశ్, భీమినేని సురేశ్, ఎంపరాళ్ల కుమారస్వామి, పావులూరి డిల్లీ బాబు, గుత్తా అమరనాథ్, గుత్తా గురుప్రసాద్, హేమంత్ తలపనేని, దేవా, వాసు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న టీడీపీ జీడీ నెల్లూరు ఇన్‌చార్జ్ డాక్టర్ థామస్



ఎమ్మెల్సీ శ్రీకాంత్‌ను సత్కరిస్తున్న టీడీపీ మహిళా అభిమానులు

గాంధీ ప్రారంభించిన బావికి జీర్ణోద్ధరణ

▸ స్మారకంగా తీర్చిదిద్దడంపై ప్రశంసలు



ఆధునికీకరించిన బావితో ఎమ్మెల్యే ఎస్‌టీ సోమశేఖర్ తదితరులు

బెంగళూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): జాతిపిత మహాత్మాగాంధీ ఆరం భించిన తాగునీటి బావికి జీర్ణోద్ధరణ చేసి స్మారకంగా తీర్చారు. బెంగళూరు నగర శివారులోని కెంగేరివద్ద ఉండే బావి వద్ద సోమవారం ప్రత్యేక కార్య క్రమాలు జరిపారు. 1934లో గాంధీజీ బెంగళూరును సందర్శించిన వేళ కెంగేరి గ్రామంలో తాగునీటి సమస్య ఉండేది. అప్పటి ప్రముఖులు కొందరు సూచన మేరకు బెంగళూరు అభివృద్ధి మండలి (బీడీబీ) వృత్తాకార రూపంలో బావిని తవ్విని ప్రజలకు తాగునీటి సౌలభ్యాన్ని కల్పించారు. విషయం తెలిసిన మేరకు గాంధీజీ గ్రామాభివృద్ధిలో భాగంగా ప్రజలకు అవసరాలు తీర్చడం ముఖ్యమని నగర సందర్శన వేళ 1934 జనవరి 1న బావిని ఆరంభించారు. సమాజసేవ చేసిన వారిని అభినందించారు. గాంధీజీ ప్రారంభించిన బావి దశాబ్దాల కాలంగా శిథిలమైంది. ఈ ప్రాంతంలో భూగర్భజలాలు అడుగంటడంతో బావి ఉపయోగంలో లేకపోవడంతో పట్టించుకునేవారు లేకపోయారు. సమాచారం అందుకున్న స్థానికులు కెంగేరి ప్రజల హితరక్షణ వేదిక పేరిట ఒక కమిటీగా ఏర్పాటయ్యారు. బావిచుట్టూ పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించారు. రంగులు వేసి అందంగా తీర్చారు. గాంధీజీ ఆరంభించిన బావిని స్మారకంగా తీర్చాలని వేదిక సభ్యులు డిమాండ్ చేశారు. ఇలా 90ఏళ్ల తర్వాత గాంధీజీ ఆరంభించిన బావికి పూర్వవైభవం వచ్చింది. సోమవారం కెంగేరి ప్రాంతానికి చెందిన అన్ని విద్యాసంస్థల విద్యార్థులు నగర వీధులలో ర్యాలీ జరిపి బావి వద్ద ప్రత్యేక సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సోమశేఖర్ మాట్లాడుతూ మహాత్మాగాంధీ ప్రపంచం మెచ్చిన నేత అని అందుకే జాతిపితగా కొలుస్తారన్నారు. గాంధీజీ నడియాడిన ప్రదేశం ఉండడం గర్వంగా భావిద్దామని పిలుపునిచ్చారు. బావికి పూర్వవైభవం తీసుకొచ్చిన హితరక్షణ వేదిక సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో స్థానికులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

సంస్కృతికి ప్రతీక సంక్రాంతి



జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో ప్రముఖులు

బెంగళూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): దేశంలోని వివిధ ప్రాంతాల్లో నివసించే ప్రజలు భాష, కులమతాలకు అతీతంగా నిర్వహించే సంక్రాంతి వేడుకలు సౌహార్ద్రతకు ప్రతీకంగా ఉన్నాయని తెలుగు విజ్ఞాన సమితి అధ్యక్షుడు డా.ఎ.రాధాకృష్ణరాజు పేర్కొన్నారు. బెంగళూరు వయ్యాలికావల్‌లోని తెలుగు విజ్ఞాన సమితి ప్రాంగణంలో ఆదివారం ఏర్పాటైన ముందస్తు సంక్రాంతి వేడుకలను ఆయన జ్యోతి ప్రజ్వలనతో లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ గోపూజ వంటి సంప్రదాయాలు మనందర్నీ ఏకం చేస్తున్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, తమిళనాడు, మహారాష్ట్ర ఒడిషా తదితర రాష్ట్రాలలో సంక్రాంతి వేడుకలు వైభవోపేతంగా జరుగుతూ మన సంప్రదాయాలకు శ్రీరామ రక్షగా ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా బిటిఎం లేఅవుట్ తెలుగు ప్రముఖులు మేజర్ దాశరధి, చంద్రు ఆచారి అయోధ్య రామమందిరం నుండి వచ్చిన అక్షింతలను సభ్యులకు పంచిపెట్టారు. అంతకు ముందు భోగి మంటలతో వేడుకలు ఉత్సాహ భరితంగా ప్రారంభమయ్యాయి. అనంతరం సంప్రదాయ బద్ధంగా గోపూజలను, కోలాటం నృత్యాలను నిర్వహించారు. తదుపరి మహిళలకోసం ప్రత్యేకంగా ముగ్గుల పోటీలను నిర్వహించారు. మొదటి బహుమతిని లక్ష్మీ, ద్వితీయ బహుమతిని త్రివేణి, తృతీయ బహుమతిని మంగళ, లీలూ సమ్మీ, రత్నమ్మలు గెలుపొందారు. ఈ పోటీలలో పాల్గొన్న అందరికీ ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. నగరవ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి మహిళలు, యువతులు ఈ పోటీలో ఉత్సాహ భరితంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షులు కె.గంగరాజు, ఆర్.ఆదికేశవులు నాయుడు, ప్రధాన కార్యదర్శి ఇడమకంటి లక్ష్మీరెడ్డి, కోశాధి కారి సి.ఎ.వరదరాజు, మహిళా కార్యదర్శి లక్ష్మీ శరత్, సంయుక్త కార్యదర్శి ఎంఎస్ చంద్రమోహన్, కార్యవర్గ సభ్యులు కెఎన్. నరసింహమూర్తి, గణేష్ శంకర్, కృష్ణయ్య, వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.



ముగ్గులు వేస్తున్న మహిళలు

అయోధ్య అక్షింతల ఊరేగింపు



కోదండరామస్వామి ఆలయం వద్ద అక్షింతల ఊరేగింపు

బంగారపేట, జనవరి 8: అయోధ్య రామమందిరంలో శ్రీరాముడి ప్రతిష్ఠాపన నేపథ్యంలో దేశవ్యాప్తంగా పవిత్ర అక్షింతలను పంపిణీ చేస్తున్నారు. ఇందులో భాగంగా అయోధ్యనుంచి విచ్చేసిన అక్షింతలను సోమవారం ప్రత్యేకంగా ఊరేగించారు. జిల్లా పంచాయతీ మాజీ సభ్యుడు బీవీ మహేశ్ మాట్లాడుతూ శ్రీరాముడి కృపా కటాక్షాలు అందరిపైనా ఉండాలని ఆకాంక్షిస్తున్నట్టు పేర్కొన్నారు. పట్టణంలోని కోదండరామస్వామి దేవస్థానం వద్ద అక్షింతలను ప్రత్యేకంగా భక్తులకు అందజేశారు. ఈ సందర్భంగా మహేశ్ మాట్లాడుతూ రామమందిరం కోసం వందలాదిమంది కరసేవకులు తమ ప్రాణాలను త్యాగం చేశారని, లక్షలాదిమంది పోరాట ఫలితంగా సాకారమవుతోందన్నారు. అయోధ్య రామమందిర ప్రారంభం రోజున అయోధ్యకు వెళ్లేందుకు అందరికీ సాధ్యం కాదని కావున ఉన్న ప్రదేశంలోనే పూజ చేసి దీపాలు వెలిగించాలని భక్తులకు సూచించారు. కాగా ఈనెల 14న సంక్రాంతిని పురస్కరించుకుని విశ్వహిందూ పరిషత్, హిందూ జాగరణ వేదిక సంయుక్త ఆధ్వర్యంలో భారీ శోభాయాత్ర నిర్వహించదలిచామన్నారు. స్థానిక నాయకుడు కే చంద్రారెడ్డి మాట్లాడుతూ ధర్మాన్ని రక్షించేందుకు విశ్వనాయకుడు ప్రధాని నరేంద్రమోదీ కార్యోన్ముఖులయ్యారన్నారు. హరిద్వార్, హృషికేశ్, కాశి, మధుర వంటి పుణ్య క్షేత్రాలను జీర్ణోద్ధరణ చేశారన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు హోసరాయప్ప, గ్రామపంచాయతీ సభ్యులు మంజునాథ్, చంద్రశేఖర్, శ్రీనివాస్, మంజు, హోబళి అధ్యక్షుడు నాగేశ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ వ్యాప్తంగా వాతావరణ

పెనుమార్పులతో ఆందోళన

▸ పద్మభూషణ్ డాక్టర్ జగదీష్ శేర్

బెంగళూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రపంచవ్యాప్తంగా వాతావరణంలో చోటు చేసుకుంటున్న పరిణామాలు ఒకింత ఆందోళన కలిగిస్తున్నాయని పద్మభూషణ్ గ్రహీత డా.జగదీష్ శేర్ పేర్కొన్నారు. నగరంలో ఇండస్ బిజినెస్ అకాడమీ ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా జరుగుతున్న అంతర్జాతీయ సదస్సు మా ర్యాన్ 2024 ముగింపు వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ పర్యావరణ సంరక్షణపై మరింతగా దృష్టిని సారించాల్సిన అవసరం ఉందన్నారు. మరో అతిథి డాక్టర్ వీ కుమార్ మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలను పెంపొందించే విష యంలో బ్రాండ్ల పాత్ర కీలకమన్నారు. ఈ సదస్సులో దేశవిదేశాల నుంచి విద్యానిపుణులు హాజరయ్యారు. ఇదే వేదికపై బీఎంఎల్ జైన్ స్మారక లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును డా.వి.కుమార్‌కు సంస్థ చైర్మన్ మనీష్ జైన్ అందజేశారు. ఐఐఎంబికు చెందిన శైనేష్‌కు కూడా పురస్కారం ప్రదానం చేసి గౌరవించారు. సదస్సులో డా.కల్పనా గోపాలన్, ప్రభుత్వ అదనపు ముఖ్య కార్యదర్శి డా.స్వప్న అబ్రహాం, సదస్సు సహ అధ్యక్షుడు డా.నాగేంద్ర హెగ్డే, ప్రొఫెసర్ నరేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.



పురస్కారం అందజేస్తున్న దృశ్యం

కేఆర్ఎస్‌కు 30 కి.మీ. పరిధిలో క్వారీలపై నిషేధం

▸ హైకోర్టు ఆదేశాలు

బెంగళూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండ్య జిల్లాలోని కృష్ణరాజసాగర్ జలాశయం (కేఆర్ఎస్)కు 30కిలోమీటర్ల పరిధిలో క్వారీలు (గనుల తవ్వకాల)ను నిషేధిస్తూ హైకోర్టు ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. మండ్య జిల్లా చినకురళి గ్రామానికి చెందిన సీజీ కుమార్ అనే వ్యక్తి దాఖలు చేసిన పిల్‌పై సోమవారం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రసన్న బాలచంద్ర వరాళె, న్యాయమూర్తి కృష్ణ ఎస్ దీక్షిత్‌ల ధర్మాసనం విచారణ జరిపి ఆదేశించింది. ధన్‌బాద్‌లో గనులు, ఇంధన పరిశోధనా సంస్థ ద్వారా ప్రాజెక్టుపై సాంకేతిక సమీక్షకు ఆదేశాలు జారీ చేశారు. నివేదిక వచ్చే వరకు ప్రాజెక్టు పరిసర ప్రాంతాల్లో గనుల తవ్వకాలు పూర్తిగా నిషేధమని ధర్మాసనం సూచించింది. ప్రాజెక్టు చుట్టుపక్కల ప్రాంతాల్లో భారీ శబ్దాలతో ఇప్పటికే ఈ ప్రాంత ప్రజలు భయపడే పరిస్థితిని తీవ్రంగా పరిగణించాలని ధర్మాసనం సూచించింది. కేఆర్ఎస్ చారిత్రాత్మక నిర్మాణమని, మైసూరు మహారాజు నాల్వడి కృష్ణరాజ ఒడయార్, దేశం మెచ్చిన ఇంజనీర్ భారతరత్న సర్ ఎం విశ్వేశ్వరయ్యల కృషి ఫలితంగా ఏర్పడిందని తీతాశర్మ అనే రచయిత విశ్వేశ్వరయ్యకు సంబంధించిన పుస్తకంలో పొందుపరిచిన అంశాలను ధర్మాసనం ప్రస్తావించింది. కావేరి నీటి కోసం మూడు రాష్ట్రాలు పోరాటం చేస్తున్నాయని, కానీ కేఆర్ఎస్ ప్రాజెక్టు సంరక్షణకు ప్రయత్నించడం లేదన్నారు. ప్రాజెక్టుకు సమస్య తలెత్తితే రాష్ట్రానికి పెను ప్రమాదం లాంటిదన్నారు. మండ్య జిల్లా చినకురళి గ్రామానికి చెందిన సీజీ కుమార్ సొంతపొలంలో గనుల తవ్వకాలకు అవకాశం ఇవ్వాలని జిల్లా అధికారికి వినతిని సమర్పించారు. జిల్లా అధికారులు పలు నిబంధనలతో అనుమతులు ఇచ్చారు. కావేరి జల మండలి ద్వారా అధికారులు పేలుడును పరిశీలించి నివేదిక ఇస్తామని అందుకు కట్టుబడాలని రైతుకు సూచించారు. కేఆర్ఎస్ నుంచి చినకురళి గ్రామం సుమారు 16 కిలోమీటర్ల దూరంలో ఉంది. అయితే నివేదిక వచ్చేవరకు ఆగలేమని రైతు హైకోర్టు ధర్మాసనాన్ని ఆశ్రయించారు. ఈమేరకు విచారణ జరిపిన ధర్మాసనం కేఆర్ఎస్‌కు 30 కిలోమీటర్ల పరిధిలో ఎటువంటి తవ్వకాలు చేపట్టరాదని స్పష్టం చేసింది.

జేడీఎస్ ఎమ్మెల్యేలకు సీఎం, డీసీఎం గాలం

▸ కుమారస్వామి సంచలన ఆరోపణ

బెంగళూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): జేడీఎస్ ఎమ్మెల్యేలకు సీఎం సిద్ద రామయ్య, డీసీఎం డీకే శివకుమార్‌లు గాలం వేస్తున్నారని ఇరువురు కలిసి రాష్ట్రంలో పార్టీని నిర్వీర్యం చేసేలా కుట్రపన్నారని మాజీసీఎం కుమారస్వామి సంచలన ఆరోపణలు చేశారు. ఆదివారం కుమారస్వామి మీడియాతో మాట్లాడుతూ మాజీ ప్రధాని దేవేగౌడ పట్ల సీఎం సిద్దరామయ్య ఎటువంటి వ్యాఖ్యలు చేశారనేది పరిశీలించానన్నారు. రాష్ట్రంలో జేడీఎస్ పార్టీ ఉండరాదనే అజెండాగా పెట్టుకున్నారన్నారు. ఇప్పటికీ వారి వీరి ఇళ్ళ తలుపులు తడుతున్నారని మండిపడ్డారు. నియోజకవర్గాల అభివృద్ధి పనుల కోసం వెళితే జేడీఎస్‌ను వీడండి కాంగ్రెస్‌లో చేరండి అంటూ సూచిస్తున్నారన్నారు. మీకేం కావాలో చెప్పండి చేసి పెడ తామంటూనే ఎన్నికోట్లు కావాలో అంతా ఇస్తామని భరోసా ఇస్తున్నారన్నారు. ఏ కారణానికి ఇలా చేస్తున్నారనేది తెలియడం లేదన్నారు. రాష్ట్రంలో జేడీఎస్ అనేది లేకుండా ఇలాంటి కుట్రలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఏపార్టీ నుంచి ఎదిగారో ఎవరి నాయకత్వంలో అభివృద్ధి చెందారనే కృతజ్ఞత లేదని మండిపడ్డారు. రాష్ట్రంలో జరుగుతున్న దౌర్జన్యాలు, అక్రమాలకు ప్రజలే గుణపాఠం చెబుతారని దేవేగౌడ వ్యాఖ్యానించారన్నారు. డీకేశివకుమార్ కాంగ్రెస్‌కు 135 ఏళ్ళ చరిత్ర అంటారని గాంధీ ఉన్నప్పటికీ ప్రస్తుతానికి సంబంధం లేదన్నారు. ఈస్ట్ ఇండియా కంపెనీ దుర్మార్గాలనే కొనసాగించుకుపోతున్నారన్నారు. స్వాతంత్ర్యం కోసం ఇళ్ళు, ఆస్తులు అమ్మి పోరాటం చేశారని ప్రస్తుతం నాయకులు చేస్తున్నది ఏమిటని నిలదీశారు. బీజేపీతో పొత్తు కుదిరిందని లోక్‌సభ ఎన్నికలలో ఎక్కడ పోటీ చేయాలనేది, సీట్ల సర్దుబాటుపై చర్చలు జరుగలేదన్నారు. అవసరమైతే మండ్య ఎంపీ సుమలతను కలుస్తానని ఇందులో తప్పేమిటని ప్రశ్నించారు. సుమలత బీజేపీలో కొనసాగేలా ఉంటే కలుస్తానని మేం ఎక్కడ పోటీ చేయాలనేది ఇంకా నిర్ణయించుకోలేదన్నారు. బీజేపీతో పొత్తు స్నేహపూర్వకంగా ఉండాలని అందరినీ కలుస్తామన్నారు.

అలెమారి సాహిత్య సాంస్కృతిక

కళోత్సవానికి స్వామీజీకి ఆహ్వానం



స్వామిజీకి ఆహ్వాన లేఖ అందిస్తున్న ప్రముఖులు

బెంగళూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మైసూరులోని టౌన్ హాల్‌లో ఈ నెల 28న జరుగనున్న అలెమారి సాహిత్య, సాంస్కృతిక కళోత్సవానికి హాజరు కావా ల్సిందిగా వనకల్లు మల్లేశ్వర మహా సంస్థాన పీఠాధిపతి డాక్టర్ బసవ రామానంద స్వామిజీని ఆహ్వానించారు. సంచార జాతుల సమాఖ్య గౌరవ అధ్యక్షుడు కె.రవీంద్ర శెట్టి, అధ్యక్షుడు ఎం.ప్రకాష్, కార్యాధ్యక్షుడు శంకర్ హెబ్బళ్ళి, రామనగరం జిల్లా సలహా సమితి సభ్యుడు మాగడి మారెప్ప, గణేష్ యాదవ్ తదితరులు తొలుత స్వా మిజీ ఆశీస్సులను పొందారు. కళోత్సవాన్ని విజయవంతం చేసేందుకుగాను రాష్ట్ర మంతటా పర్యటిస్తున్నామని గౌరవ అధ్యక్షుడు కే రవీంద్ర శెట్టి సోమవారం మీడియాకు చెప్పారు.

కేపీఎంఏ కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గం ఇదే..

బెంగళూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక పేపర్ మర్చంట్స్ అసోసియేషన్ (కేపీఎంఏ)కు 2024-25 సంవత్సరాలకు గాను నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు కార్యదర్శి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అసోసియేషన్ నూతన అధ్యక్షునిగా వినోద్ నేనావత్, ఉపాధ్యక్షులుగా దినేష్ జైన్, ప్రవీణ్ లుంకాడ్, కార్యదర్శి విక్రం భూత్రా, సంయుక్త కార్యదర్శిగా హల్లాస్ కుమార్, కోశాధికారిగా రమేష్ సలేచాలతో పాటు కార్యవర్గ సభ్యులు ఎన్నికైన ట్లు ప్రకటనలో తెలిపారు. కాగా ఇదే సందర్భంగా పదవి నుంచి తప్పుకున్న రమేష్ భూత్రాను ఘనంగా సన్మానించారు. అసోసియేషన్ సభ్యులందరికీ నూతన పదాదికారులు ధన్యవాదాలు తెలిపారు.

కేంద్ర పథకాలపై గ్రామాల్లో అవగాహన



డ్రోన్ పథకం పనితీరుపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

శిడ్లఘట్ట, జనవరి 8: కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి అవగాహన కల్పించేలా వికసిత భారత సంకల్పయాత్రను తాలూకాలోని మళమాచనహళ్ళి, ఆనూరు గ్రామాలలో చేపట్టారు. బీజేపీ నాయకుడు సీకల్ ఆనంద్ గౌడ మాట్లాడుతూ గ్రామపంచాయతీల పరిధిలో దారిద్ర్యరేఖకంటే దిగువన ఉన్నవారి జీవితాల్లో వెలుగులు నింపేలా కేంద్రప్రభుత్వం పలు పథకాలు అమలు చేస్తోందని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రధానమంత్రి ఆవాజ్ యోజనె, పోషన్ అభియాన్, ఉజ్వలా యోజనె, పీఎం గరీబ్ కల్యాణ్ యోజనె, ఆయుష్మాన్ భారత్, ఫసల్‌బీమా యోజనె, కౌశల్యాభివృద్ధి పథకం, జనౌషధి యోజనె, విశ్వకర్మ, తదితర పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పీఎం కిసాన్ డ్రోన్ యోజనెకు కేంద్రప్రభుత్వం 70శాతం సహాయధనాన్ని ఇస్తోందన్నారు. గ్రామ పంచాయతీలలో రైతులకు బాడుగకు ఇచ్చే అవకాశం ఉందన్నారు. ఈ సదర్భంగా కిసాన్ డ్రోజన్ పథకం గురించి ప్రయోగాత్మకంగా వివరించి మందులను పిచికారి చేశారు. ఈ సందర్భంగా క్యాలెండర్‌ను, కొంతమందికి ఆయుష్మాన్ కార్డులు, గ్యాస్ స్టవ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాళమాచనహళ్ళి బీ రవిగౌడ, దిశా కమిటీ సభ్యులు వెంకటేశ్, ఆనూరు గ్రామపంచాయతీ అధ్యక్షుడు హిత్తలహళ్ళి వెంకటేశ్, ఉపాధ్యక్షురాలు నేత్రావతి, తాలూకా ఆరోగ్య అధికారి డాక్టర్ వెంకటేశ్ మూర్తి, మాజీ అధ్యక్షుడు, ప్రస్తుత సభ్యుడు విజయేంద్ర పాల్గొన్నారు.